క్లుప్తంగా

నేటి నుంచి నా మట్టి.. నా దేశం


సెల్ఫీ దిగుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 9 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా నా మట్టి.. నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు గ్రామ పంచాయతీలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9న ప్రధాని, ముఖ్యమంత్రి సందేశంతో పాటు అమృత్ సరోవర్ చెరువుల వద్ద స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపిక శిలాఫలకాలు ఏర్పాటు చేసి సెల్ఫీలు దిగి నిర్దేశిత వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. 10న పంచ ప్రాణ ప్రతిజ్ఞ, 11న వసుధకు వందనం పేరుతో 75 మొక్కలను నాటడం, 14న సమరయోధుల కుటుంబాల సత్కారం, 15న జాతీయ జెండా ఎగురవేసి వందన సమర్పణ చేయాలని తెలిపారు. 16 నుంచి 20 వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. యువత మట్టిని సేకరించి కలశాల్లో తీసుకుని ఈనెల 27, 28 తేదీల్లో ఢిల్లీకి వెళ్లాలని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలను అధికారులంతా సమన్వయంగా చేపట్టాలని కలెక్టర్ కోరారు.

విద్యార్థులు నిత్య పరిశోధకులు కావాలి

కాళ్ల: విద్యార్థులు నిత్య పరిశోధకులు కావాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎంఆర్ రాజు అన్నారు. మండలంలోని పెదఅమీరంలోని మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్ట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 'సృజన' బాలవికాస కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి విషయాన్ని పరిశీలించి, విశ్లేషించి, పరిశోధన చేయాలన్నారు. నూతన ఆవిష్కరణలు చేసే విధంగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో సైన్స్ క్లబ్ ఏర్పాటు చేసి సైన్స్‌పై ఆసక్తిని పెంచి విద్యార్థుల సృజనాత్మక శక్తిని పెంపొందించే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు ఉత్తమ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఈఓ ఇందుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

ఉండి: నాయీబ్రాహ్మణులను కించపరుస్తూ కులదూషణ చేసిన మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకరరెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఉండి నాయీబ్రాహ్మణులు డిమాండ్ చేశారు. జేసీ ప్రభాకరరెడ్డి వ్యాఖ్యలపై మంగళవారం ఉండి నాయీబ్రాహ్మణ భవన్‌లో సంఘ నాయకులు సమావేశమయ్యారు. సమాజంలో కుల, మతాల విషయంలోఎంతో మార్పు వచ్చినా కొందరు మూర్ఖుల్లో మార్పు రావడం లేదన్నారు. గతంలో నాయీబ్రాహ్మణ కులానికి చెందిన ఓ అధికారిపై నోరుపారేసుకుని చివరకు క్షమాపణలు చెప్పాడని అయినా ఆయన పద్ధంతి మారలేదంటూ తీవ్రంగా విమర్శించారు. ఇటువంటి చెడ్డ ప్రవర్తన కలిగిన వారిపై ప్రభుత్వం జీవో నంబర్ 50 ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి మల్లువలస వీరవెంకట సత్యనారాయణ, జిల్లా నాయకులు మల్లువలస రవికుమార్‌దుర్గారావు,ముత్యాలపల్లి సత్యనారాయణ, ముత్తాలపల్లి సత్తిబాబు, వీర్రాజు, శ్రీను,దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

శాంతిని నెలకొల్పాలి


మానవహారం నిర్వహించిన విద్యార్థులు

ఆకివీడు: మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారిపై పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద మంగళవారం మానవహారం నిర్వహించి మణిపూర్ బాధితులకు సంఘీభావం తెలిపారు. డీవైఎఫ్ఐ. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు గేదల ధనుష్, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

జువ్వలపాలెంలో..

కాళ్ల: మణిపూర్ హింసకాండను నిరసిస్తూ మండలంలోని జువ్వలపాలెం పాతపేట సీబీసీఎన్‌సీ పరిశుద్ధ ఆలయం బాప్టిస్ట్ చర్చ్‌లో ఏఐసీఎఫ్ ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మరణించిన ప్రతి క్రైస్తవ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎం.రాజ్ కుమార్, ఎం. రత్న కుమార్, ఎ.జార్జి బెన్‌హర్, యాకోబు, ఎన్.కుమారి పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులకు సంఘీభావం

సాక్షి, భీమవరం: మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ విమర్శించారు. మంగళవారం భీమవరం పట్టణం 11వ వార్డు రాజ్‌ట్రస్ట్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాదె రాజు, పాలపర్తి సాగర్, కె.శ్రీనివాస్, ఎస్ మహేష్, ఎస్ వికాష్, కె.ప్రకాష్, జీడీ కరుణాకర్, దాసరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

15న ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరాలి

ఎమ్మెల్యే శ్రీనివాస్


ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు జాతీయ జెండాను అందజేస్తున్న బాలసుబ్రహ్మణ్యం


ఆసుపత్రి నిర్మాణంపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆగస్టు 15న ప్రతి ఇంటిపైనా జాతీయజెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ పి.బాలసుబ్రహ్మణ్యం ఎమ్మెల్యేకు జాతీయ జెండాను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయజెండాను ఎగురవేసి, గాంధీ మహాత్మునికి ఘనంగా నివాళులర్పించాలని కోరారు. జాతీయ జెండాలు పోస్టల్ కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉంటాయని చెప్పారు.

ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిని పూర్తి చేయాలి

భీమవరం పట్టణంలో చేపట్టిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని మరింత వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆసుపత్రి పనులకు సంబంధించి ఏపీఎంఐఎస్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌సీసీ కన్‌స్ట్రక్షన్ సైట్ ఇన్‌చార్జి కృష్ణతో సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రి నిర్మాణానికి తొలి విడత మంజూరైన రూ.10.50 కోట్లతో పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాబార్డు నుంచి మరో రూ. 31 కోట్లు త్వరలోనే మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం భవన నిర్మాణం శ్లాబ్ దశకు చేరిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని, అందులో భాగంగానే భీమవరంలో 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే పశ్చిమగోదావరి, ఏలూరు, కోనసీన, కృష్ణా జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

బియ్యంతో 108 రకాల వంటలు

స్థానిక కలెక్టరేట్ గ్రౌండ్‌లో మంగళవారం పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ రేషన్ బియ్యంతో వంటకాలు తయారీ పోటీల ప్రదర్శన ఏర్పాటు చేసింది. డీఆర్‌డీఏ, మెప్మా, ఐసీడీఎస్ శాఖ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్ని, రేషన్ బియ్యంతో ఒక గంట సమయంలో 108 రకాల వంటలను తయారుచేసి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జేసీ రామసుందర్‌రెడ్డితో పాటు జిల్లా అధికారులు, ప్రదర్శన తిలకించడానికి వచ్చిన వారిని ఆశ్చర్యపర్చారు. రేషన్ బియ్యం, జామకాయలతో బుర్రులు, గంజి సూప్, స్వీట్ బిర్యాని తదితర కొత్తకొత్త వంటలు తయారు చేసి అందరికి రూచి చూపించి ప్రశంసలు అందుకున్నారు.

\- భీమవరం (ప్రకాశం చౌక్)


రేషన్ బియ్యంతో వంటకాల ప్రదర్శనకు హాజరైన మహిళలు


అరిసెలు, గవ్వలు,


బెల్లం పానకం, దిబ్బరొట్టె


జామకాయ బూరెలు, అప్పడాలు


గంజి సూప్


క్రిస్ప్ యెయోస్

పోషకాహారం తీసుకోవాలి

వీరవాసరం: నాణ్యతతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చని వడ్డిగూడెం సర్పంచ్ సైదు శ్రీను అన్నారు. వడ్డిగూడెంలో మంగళవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ఆయన పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తోన్న కిట్లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎ.పుష్పరాణి, పి.నాగరత్నం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

సాక్షి, భీమవరం: స్థానిక టుటౌన్‌లోని బైపాస్ రోడ్డులో మంగళవారం పేకాడుతోన్న ముగ్గుర్ని అరెస్టు చేసి, రూ.14 వేలు స్వాధీనం చేసుకున్నట్లు టుటౌన్ సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. వన్‌టౌన్‌లోని బస్టాండ్ ప్రాంతంలో నంబర్ పందాలు ఆడుతోన్న ఎనిమిది మందిని అరెస్టు చేసి, రూ.2,250 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జగన్ పాలనలో ప్రజల చెంతకే పరిపాలన

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్


దొడ్డనపూడి గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న పీవీఎల్

కాళ్ల: ప్రజల చేంతకే పరిపాలన తీసుకొచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు అన్నారు. మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల వారీగా అందుతున్న సంక్షేమాన్ని వారికి వివరించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో ఏ ఇంటికి వెళ్లిన సంక్షేమ పథకాలు పొందుతూ మహిళలంతా ఆనందంగా ఉన్నారన్నారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాల అందిస్తూ సీఎం జగన్ ప్రజల మనసులు గెలుస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బంది వల్ల చదువు ఆపకూడదని లక్ష్యంతో అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రజాబలం ఉన్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఒక్కరేనని చెప్పారు. అన్ని వర్గాలతోపాటు కాపు సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాపు నేస్తం పేరుతో కాపులను అన్ని విధాలా ఆదుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, కాళ్ల సొసైటీ అధ్యక్షుడు సుంకర భోగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు యిర్రింకి కాశీ జగన్నాధం, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుండా సాయి, కొల్లి వెంకటరామకృష్ణ, చెన్నంశెట్టి దేవి ప్రసాద్, కొల్లి సూర్య సుబ్బారాయుడు, కొల్లి వెంకట సుబ్బారావు, కొల్లి తారకరంగారావు, ఆరేటి రంగారావు, ఎస్.శ్రీకాంత్, పల్లికొండ నవీన్, చిన్నం యోహాను, గుండు నాగేశ్వరరావు, పెన్మెత్స రంగరాజు, బొత్స అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌లో ఐఈఈఈ పాత్ర అమోఘం


రవిచంద్రన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సాంకేతికత అభివృద్ధి, పరిశోధన జ్ఞానభాగస్వామ్యాన్ని వృత్తిపరమైన అభివృద్ధిని ప్రోత్సహించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు, పరిశోధకులను కనెక్ట్ చేయడం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్స్ (ఐఈఈఈ) ముఖ్య ఉద్దేశమని ఐఈఈఈ మెంటర్ డాక్టర్ పెరియసామి ప్రదీప్ రవిచంద్రన్ అన్నారు. స్థానిక విష్ణు ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఇంజినీరింగ్ విద్యలో ఐఈఈఈ పాత్ర అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఐఈఈఈ మానవాళి ప్రయోజనం కోసం సాంకేతికతను అభివృద్ధిచేయడానికి అంకితమైన ప్రొఫెషనల్ అసోసియేషన్ అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ మాట్లాడుతూ ఐఈఈఈ వర్క్‌షాప్ అధ్యాపకులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, వర్క్‌షాప్ కన్వీనర్ వైఎంవీ నాగరాజారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు దొడ్డనపూడిలో గడపగడపకు మన ప్రభుత్వం

కాళ్ల: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దొడ్డనపూడి గ్రామంలో మూడో రోజు బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తామని, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు కార్మిక సంఘాల మహాధర్నా


మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదింపి దేశాన్ని కాపాడుకోవడానికి ఈనెల 9న స్థానిక క్విట్ ఇండియా స్థూపం వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చెల్లబోయిన రంగారావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం భీమవరం పట్టణ ప్రధాన రహదారుల్లో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్, రంగారావు మాట్లాడుతూ మోదీ అధికారం చేపట్టిన తొమ్మిదేళ్లలో కార్మికులు, ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచవుకగా అమ్ముతున్నారని, ఉద్యోగులను నిరుద్యోగులుగా మారారని, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంపన్న వర్గాలకు రూ.12 లక్షల కోట్లు రుణమాఫీ చేసిన కేంద్రం రైతాంగానికి కనీసం గిట్టుబాటు ధర కల్పించలేని దౌర్భాగ్య పరిస్థితి ఉందని వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు బి.వాసుదేవరావు, బి.సత్యనారాయణ, ఎం వైకుంఠరావు, బాషా, నీలపు శ్రీను, రమణరావు, ఆశీర్వాదం, యోహాన్, రెల్లి రాము, డి.కళ్యాణి, బంగారు వరలక్ష్మి, నిమ్మకాయ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన


డీఎన్నార్ కళాశాలలో మాట్లాడుతున్న రాజేష్

సాక్షి, భీమవరం: విద్యాసంస్థల్లో విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని న్యాయవాదులు ఎ.రాజేష్, సి.జ్వాలాశ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ర్యాగింగ్ నిర్మూలనపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యాసంస్థల ఆవరణలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, ర్యాగింగ్ చేస్తే కలిగే దుష్పరిణామాలను పోస్టర్స్ రూపంలో ఏర్పాటుచేయాలని, ర్యాగింగ్ చేసే విద్యార్థులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని అన్నారు. ర్యాగింగ్ తీవ్రతను బట్టి ఆరేళ్ల నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష విధించే అవకాశం ఉందని వివరించారు. డాక్టర్ జీవీ వాణి మాట్లాడుతూ కొత్త విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టడానికి సీనియర్స్ ప్రయత్నించాలని, జూనియర్స్ మరింత ఇబ్బందులకు గురిచేయకూడదని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఎం అంజన్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఎం దుర్గాప్రసాద్, పీఎల్‌వీఎం కమలరాజు, కె.శివరామ రాజు, యాంటీ రాగింగ్ కమిటీ కో ఆర్డినేటర్ జి.జ్ఞానరత్నం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందాలను అమలు చేయాలి

ఆకివీడు: నూతన వేతన ఒప్పందాల్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బజారు ముఠా వర్కర్ల యూనియన్ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాసుదేవరావు మాట్లాడుతూ బజారు ముఠా కార్మికుల వేతనాలు పెంచడంలో యజమాన్యాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రొయ్యల మేత, ఎరువులు, ఇతరత్రా ఎగుమతులు, దిగుమతులు చేసేందుకు ముఠా కూలీ ఛార్జీలు ప్రతీ రెండేళ్లకొకసారి అగ్రిమెంట్ ప్రకారం అమలుజేస్తున్నారని చెప్పారు. గత 11 నెలలుగా నూతన ఒప్పందం చేసుకోకపోవడం దురదుష్టకరమన్నారు. వేతన ఒప్పందు జరగకపోతే కార్మికులు సమ్మెలోకి వెళ్లతారని వాసుదేవరావు హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంకి అప్పారావు, కె.తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలతో రైతులకు లాభం


పంటకోత ప్రయోగాలపై సూచనలిస్తున్న ఉప గణాంక అధికారి వెంకటేశ్వరరావు

ఆకివీడు: పంట కోట ప్రయోగాలతో రైతులకు లాభం చేకూరే విధంగా ఆర్బీకే ఇన్‌చార్జులు కృషి చేయాలని ఉప గణాంక అధికారి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఆకివీడు ఆర్బీకే వద్ద ఇన్‌చార్జులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 హెక్టార్ల వరి కలిగిన గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని వరి సాగుపై పంట కోత ప్రయోగాలు చేపట్టాలన్నారు. ర్యాండమ్ పద్ధతిలో పంట కోత చేపట్టాలని సూచించారు. పంటల బీమా, పంట నష్టం వంటివి పంట కోత ప్రయోగాలపై ఆధారపడి ఉంటాయన్నారు. ఏఓ ప్రియాంక మాట్లాడుతూ పంట కోత ప్రయోగం జరిగిన తరువాత ఆహార పదార్థాల నిల్వలు, ఉత్పాదకాలను పంట కోత ప్రయోగాలతో నిర్ధారించాలని సూచించారు. సమావేశంలో సహాయక గణాంక అధికారిణి ప్రశాంతి, ఆర్బీకే ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

నామినేషన్లు నిల్

ఉండి: మండలంలోని కలిసిపూడి గ్రామ పంచాయతీ 3వ వార్డుకు నిర్వహిస్తున్న ఉప ఎన్నిక కోసం సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. మంగళవారం నుంచి నామినేషన్‌లు దాఖలు చేసుకునే అవకాశం ఉండటంతో మంగళవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఈఓపీఆర్‌డీ కె.డలరావు తెలిపారు. గతంలో వార్డు సభ్యుడుగా గెలుపొందిన వ్యక్తి మరణించడంతో ఈ ఎన్నిక జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం వరకూ నామినేషన్‌లకు గడువు ఉందని ఆయన తెలిపారు. ఈ నెల 19న ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు.

నామినేషన్ల స్వీకరణ

వీరవాసరం: మెంటేపూడి మత్స్యపురి గ్రామాల్లో వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైందని ఎంపీడీఓ కె.జ్యోతి తెలిపారు. మెంటేపూడి ఒకటో వార్డుకు ఒక్క నామినేషన్ దాఖలయిందన్నారు. మత్స్యపురి గ్రామంలో మూడో వార్డుకు నామినేషన్ దాఖలు కాలేదని తెలిపారు. పదో తేదీతో నామినేషన్ ప్రక్రియ పూర్తవుతుందని ఎంపీడీఓ తెలిపారు.

రీ సర్వే నిర్వహణకు ప్రత్యేక బృందాలు


కుప్పనపూడిలో రీ సర్వే కోసం వచ్చిన ప్రత్యేక బృందం

ఆకివీడు: జనన్న శాశ్వత భూ హక్కు-భూ సురక్ష కార్యక్రమంలో భాగంగా రీ సర్వే చేసేందుకు ప్రత్యేక బృందాలు మండలంలోని పలు గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించాయి. మే, జూన్ నెలలలో డ్రోన్ ద్వారా భూముల సర్వే జరిగిన విషయం విధితమే. తరువాత గ్రామ స్థాయిలో రికార్డుల పరిశీలన చేశారు. డ్రోన్ కెమెరా నిర్ణయించిన సర్వే ప్రకారం హద్దుల్ని పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తహశీల్దార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వేయర్ల బృందాల్ని ఏర్పాటు చేశారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో ఆచంట తహసీల్దార్ బృందం, కోళ్లపర్రు గ్రామంలో నర్సాపురం తహసీల్దార్ బృందం, చినకాపవరం గ్రామంలో పెనుమంట్ర తహసీల్దార్ బృందం రీ సర్వే కార్యక్రమాల్ని మంగళవారం ప్రారంభించాయి. రీ సర్వే ఓఆర్‌పీ షీట్స్, డ్రోన్ సర్వే మ్యాప్‌ల ప్రింట్లు ఆధారంగా సరిహద్దుదారులకు 92 నోటీసులు జారీ చేసి సరిహద్దులకు తుదిరూపు తీసుకురానున్నారు. రీ సర్వే బృందం సూచించిన ప్రకారం సరిహద్దుదారులకు అభ్యంతరాలు ఉంటే తెలియజేసేందుకు అవకాశం కల్పించారు. అభ్యంతరాల్ని రీ సర్వే బృందం పరిశీలించి, సరిహద్దులను నిర్ణయిస్తుంది. రీ సర్వే బృందం గ్రామ సరిహద్దులు, భూమి వివరాలు, ప్రభుత్వ, ప్రైవేటు భూముల హద్దులు, వ్యక్తిగత భూముల వివరాల్ని రీ సర్వే బృందం నిర్ణయిస్తుంది. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో రీ సర్వే బృందం తహశీల్దార్ ఎస్వీ. సుబ్రహ్మణ్యం విలేకర్లతో మాట్లాడుతూ డ్రోన్ సర్వే సూచించిన సరిహద్దులు, రికార్డు దాఖల సరిహద్దుల్ని పరిశీలించి బృందం సరిహద్దు సర్వే రాళ్లు పాతుతారని చెప్పారు. ప్రభుత్వ భూముల్ని రీ సర్వేలో నిర్ధారిస్తామని చెప్పారు. స్థానిక తహశీల్దార్, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు సహకారం తీసుకుంటామని చెప్పారు.

శానిటేషన్‌ను పరిశీలించిన కమిషనర్

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక ఆర్టీసీ డిపో, చిన రంగనిపాలెం, ఇండస్ట్రియల్ ఏరియా, కొడవలి రోడ్డలోని శానిటేషన్‌ను వార్డులను కమిషనర్ ఎం.శ్యామల పరిశీలించారు. పారిశుద్ధ్యం మెరుగునుకు పలు సూచనలు చేశారు. నిత్యం ప్రతి ఇంటి నుంచీ వ్యర్థాలను సేకరించాలన్నారు. క్లాప్ యూజర్ చార్జీల వసూల్లో పురోగతి కనబరచాలన్నారు. పట్టణ ర్యాంకింగ్ మెరుగుదలపై సమన్వయంతో పని చేయాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.